క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీకు చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేద్దామని పిలుపునిచ్చారు.గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్, గోపాల్, మల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జైన్ కమ్యూనిటీ ఆత్మీయ సమ్మేళనం



హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని మై హోమ్ జువెల్ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం జైన్ కమ్యూనిటీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అందరికీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జైన్ సంఘ పెద్దలు, యువకులు, మహిళలు, ఎల్లేష్, ఆదిత్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సుఫీ



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఉమంగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి సుకూన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సుఫీ గాయకుడు బిస్మిల్ తన గానంతో సందర్శకులను అలరించారు. సెలవురోజు కావడంతో నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసిన సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మండిపడ్డారు. అంగన్‌వాడీల సమ్మె 21వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని శ్రామిక్ భవన్ నుంచి ర్యాలీగా వచ్చి జాతీయ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.గత 21 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఈ నెల 10న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, ఏసుమణి, మంజుల, పద్మ, విఠలమ్మ, శోభ,అనిత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని కేఎస్ బేకరి సమీపంలో వ్యక్తి మృతదేహం (40) పడి ఉన్నట్లు డయల్ 100కు ఫోన్ రావడంతో మొబైల్ స్టాఫ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. 108 వాహనానికి ఫోన్ చేయగా వారు వచ్చి చూసి అతను చనిపోయాడని నిర్ధారించారు.మృతుడు టీ షర్టు, నల్ల రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు.అతడి వివరాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

క్వశ్చన్.. స్ట్రీట్ ప్లే

- సమస్యలపై గళమెత్తిన 'ప్రోగ్రెసివ్ థియేటర్ గ్రూపు'
- ఆలోచింప చేస్తున్న హెచ్‌సీయూ విద్యార్థుల నాటక ప్రదర్శనలు



హెచ్‌సీయూ క్యాంపస్‌లో నాటక ప్రదర్శన (ఫైల్)

రాయదుర్గం: సమకాలీన, సామాజిక సమస్యలపై గళం విప్పుతూ.. ప్రశ్నిస్తూ విద్యార్థులలో మరింతగా అవగాహన పెంచేందుకు విద్యార్థులతో ఏర్పడిందే 'ప్రోగ్రెసివ్ థియేటర్ గ్రూపు'. ఆధునిక కాలంలోనూ అన్ని వర్గాల వారిని ఆలోచింపచేస్తున్నాయి 'స్ట్రీట్ ప్లే'పేరిట నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలు . 'స్ట్రీట్ ప్లే' ఆకట్టుకుంటున్నాయి. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి లోకాన్ని తట్టిలేపి సామాజిక అంశాలపై చైతన్యపరిచేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తోంది. సామాజిక స్పృహ కలిగి, లెఫ్ట్ ఐడియాలజీ ఉన్న 20మంది విద్యార్థులచే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి షేక్ జాన్ బషీర్ ఆధ్వర్యంలో ఈ గ్రూపు 2013లో ఏర్పడింది.

రైతు సమస్యలపై..

- ఖమ్మం జిల్లాకు చెందిన జాన్‌బషీర్ స్థానికంగా సిద్దారెడ్డి కళాశాలలో బీఏ సాహిత్యం చదివారు. అప్పటి నుంచే నాటకాల రూపకల్పనపై దృష్టి పెట్టారు.
- ఆ తర్వాత 2007 హెచ్‌సీయూలో థియేటర్ ఆర్ట్స్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ, పీహెచ్‌డీ చేశారు.
- ఇప్పటి వరకు 20 నాటకాలు హెచ్‌సీయూ క్యాంపస్, హైదరాబాద్ కల్చరల్ ఫెస్టివల్‌లో, రవీంద్రభారతి, రంగ్‌భూమిలో ప్రదర్శించారు
- ఢిల్లీలో రైతుల నిరసన కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా ప్రోగ్రెసివ్ థియేటర్ గ్రూపు ద్వారా అక్కడ ప్రదర్శన ఇచ్చి రైతు సమస్యలపై ఆలోచింప చేయగలిగారు.

బషీర్ సాధించిన అవార్డులు..

- 2011లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నంది అవార్డు
- 2020లో పొట్టిశ్రీరాములు యూనివర్శిటీ తెలుగు యూనివర్శిటీ నుంచి నాటక రంగంలో చేస్తున్న కృషికి జీఎల్ నర్సింహారావు స్మారక పురస్కారం అందించారు.



నేడు హెచ్‌సీయూలో మూడుచోట్ల స్ట్రీట్ ప్లే..

- హెచ్‌సీయూలో జాన్ బషీర్ దర్శకత్వంలో సోమవారం 'క్వశ్చన్' పేరిట మూడుచోట్ల ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- సాయంత్రం 5.30 గంటలకు నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద..
- రాత్రి 8.30 గంటలకు సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద..
- రాత్రి 10.30 గంటలకు నార్త్ ఎల్‌హెచ్ వద్ద.. అర కిలోమీటర్ దూరం నిర్వహించే నాటకానికే అత్యంత ఆదరణ
- పీటీజీ ఆధ్వర్యంలో సమకాలీన, సామాజిక అంశాలు, విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి లోకాన్ని చైతన్యపర్చడం కోసం హెచ్‌సీయూ క్యాంపస్‌లో అనేక నాటకాలు ప్రదర్శించారు.
- అక్టోబర్ రెవల్యూషన్‌పై ప్రేక్షకులు, కళాకారులు అర కిలోమీటరు వరకు నిర్వహించే నాటకం 'మార్చ్ ఆన్'కు అత్యంత ఆదరణ లభించింది.
- ముఖ్యంగా'పో లస్సీ లస్సీ, అచ్చే దిన్ వన్స్ అగైన్, ఓ విమేనియా, గ్లింప్సెస్ ఆఫ్ హీరా, టేక్ ఇట్ ఈజీ, ఖూన్ చాలా, ఆజాదీ కీ భర్స్మే, ఏకలవ్య, దిలాస్ట్ డైమెన్షన్, ఔరత్, హమ్ లడింగే సాథీ' వంటివి ఆదరణ పొందాయి.
- స్ట్రీట్ సాంగ్స్, చర్చా, నిరసన కార్యక్రమాల వంటివి ఈ గ్రూపు నిర్వహిస్తోంది
- హెచ్‌సీయూలో నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ 'అందర్ బాహర్' పేరిట స్ట్రీట్ ప్లే అందరిని ఆలోచింపచేసేలా ప్రదర్శించడం విశేషం.

జాతీయ స్థాయిలో తెలుగులో నాటకాల నిర్వహణే లక్ష్యం



జాతీయ స్థాయిలో నాటక ప్రదర్శన అది కూడా తెలుగులో చేయాలన్నదే లక్ష్యం. అందుకోసం ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే 20 నాటకాలకు దర్శకత్వం వహించా. అక్టోబర్ రెవల్యూషన్‌పై ప్రేక్షకులు, కళాకారులు అర కిలోమీటరు వరకు నిర్వహించే నాటకం 'మార్చ్ ఆన్'కు అత్యంత ఆదరణ లభించింది. సోమవారం హెచ్‌సీయూలో మూడు చోట్ల 'క్వశ్చన్' పేరిట స్ట్రీట్‌ప్లే నిర్వహిస్తాం.

–షేక్ జాన్ బషీర్, హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి, పీటీజీ వ్యవస్థాపకులు

గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా



జాబ్ మేళాను ప్రారంభిస్తున్న యోగానంద్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైహోం జువెల్‌లో ఆదివారం గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్ ట్రస్ట్ గజ్జెల యోగానంద్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో స్థానిక మదీనాగూడ జెనిసిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మెగా జాబ్‌మేళాలో 3000లకు పైగా యువత పాల్గొనగా 1200 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ ఎంచుకున్న రంగాలలో మరింత అనుభవం పెంపొందించడానికి వివిధ రంగాల నిపుణులచే కెరియర్ కౌన్సిలింగ్ ఎంతో ఉపయోగపడిందన్నారు. ప్రజలకు తమ ఫౌండేషన్ అందుబాటులో ఉంటుందన్నారు

కాలనీ ముఖద్వారం ప్రారంభం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు సాయిరాంనగర్ కాలనీ ఫేస్ 2 కాలనీ ముఖ ద్వారాన్ని ఆదివారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్,కృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రధానికి బహిరంగలేఖ

రాయదుర్గం: తెలంగాణ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ పక్షాన విద్యార్థి సమస్యలపై అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి అరుణ్‌కేతన్ బహిరంగలేఖ రాశారు.ఈ మేరకు హెచ్‌సీయూ వద్ద ఆదివారం మాట్లాడుతూ సీయూఈటీ ప్రభావం వల్ల తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ,వివిధ కోర్సులలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఉత్తర తెలంగాణ ప్రాంతంలో హెచ్‌సీయూ శాటిలైట్ క్యాంపస్ ఏర్పాటు చేయాల, ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్, రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్‌కు ఆదివారం నగరవాసులు పోటెత్తారు. చెక్కతో తయారు చేసిన గృహాలంకరణ వస్తువులు, డ్రెస్ మెటీరియల్స్, తంగలీయా చీరలు, చున్నీలు ప్రత్యేక అకర్షణగా నిలుస్తున్నాయి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆంపి థియేటర్‌లో గుజరాత్‌కు చెందిన జానపద నృతాలు కాచిగోడి, పప్పెట్‌షో, రాస్ గర్బ నృత్యాలు సందర్శకులను అలరించాయి. కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవిశిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు.

7,8,9 తేదీల్లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని నోవాటెల్‌లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్‌ను అక్టోబర్ 7,8,9వ తేదీలలో మూడురోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో నటులు చాందిని బగ్వానాని,మిస్ ఇండియా తెలంగాణ ఊర్మిళా చౌహాన్, పలువురు మోడల్స్ మాట్లాడుతూ బ్రైడల్‌వేర్, వెడ్డింగ్‌వేర్, జ్యువెలరీ, ప్రత్యేక డిజైన్‌లతో కూడిన చీరలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.



హైలైఫ్ ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను విడుదల చేసిన మోడల్స్

పార్కు సుందరీకరణ పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో రూ.25 లక్షలతో పార్కు సుందరీకరణ పనులకు స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మరిన్ని పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరు విధిగా వ్యాయమం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, కార్యకర్తలు, మహిళలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫైనల్లో నంద్యాల నర్సింహారెడ్డి జోడీ

14వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ

గచ్చిబౌలి: నంద్యాల నర్సింహారెడ్డి, నీల్‌కాంత్ జోడీ మెన్స్ డబుల్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. మెన్స్ 50 ప్లస్ డబుల్స్ సెమీఫైనల్లో సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి జోడీపై నంద్యాల జోడీ 8–6 స్కోరుతో విజయం సాధించారు. 50 ప్లస్ మెన్స్ సింగిల్స్‌లో టాప్‌సీడ్ నీల్‌కాంత్‌పై 8–4 తో మంచి విజయాన్ని సాధించిన లగడపాటి శ్రీధర్ సెమిఫైనల్లో చోటు సాధించాడు. మరో క్వార్టర్స్‌లో సుధాకర్‌రెడ్డిపై 8–2తో ఎంవిఎల్ఎన్ రాజు ఏకపక్ష విజయం సాధించాడు. మెన్స్ 40 ప్లస్ డబుల్స్ క్వార్టర్స్‌లో కిరణ్, అఫ్రోజ్ జోడీ 8–5తో యోగేష్ నాగేష్‌లపై విజయం సాధించారు. సంజయ్, వహీద్ జోడీ రాంబాబు, కిరణ్‌లపై 8–7తో విజయం సాధించారు. 40 ప్లస్ సింగిల్స్ సెమీస్‌లో మురళీధర్‌పై 9–6తో నెగ్గిన విజేంద్ర గిరి ఫైనల్లోకి ప్రవేశించారు. 30 ప్లస్ డబుల్స్‌లో వివేక్‌లపై గెలుపొందగా నిఖిల్, శ్రీరామ్ జోడీ 9–7తో గురునాథ్ మంజునాథ్‌లపై చేయి సాధించారు. 30 ప్లస్ సింగిల్స్‌లో విజయ్‌ఆనంద్ 8–3తో చక్రధర్‌పై ఈశ్వర్ 8–2తో గురునాథ్‌పై కన్నన్‌సెట్టు 8–0తో భరణిలపై గెలుపొంది సెమీస్‌లో అడుగుపెట్టారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: చిట్కుల్ గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో వివిధ కాలనీలలో 5 కోట్ల 79 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 10 సంవత్సరాల కాలంలో ప్రతి గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. చిట్కుల్ గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో ప్రభుత్వం అందించే నిధులతోపాటు జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ముత్తంగి, చిట్కుల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భాగంగా ఏక్ తారీఖ్.. ఏక్ గంట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారులను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ,జెడ్పీటీసీ సుప్రజ ,మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం, మాధవి, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, చిట్కుల్ గ్రామ ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకుడు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మెరాజ్ ఖాన్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు ఆంజనేయులు దుర్గయ్య ,భుజంగం ,గౌరీ, కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.

కొనసాగిన నిమజ్జనం

13వ రోజు.. 35 భారీ గణనాథులు

హఫీజ్‌పేట్ : నవరాత్రి ఉత్సవాలు ముగిసినా మరో రెండు రోజుల పాటు వినాయక విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జామున చందానగర్, శేరిలింగంపల్లి జంటసర్కిళ్ళ పరిధిలో సుమారు 35 భారీ విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. మియాపూర్, హఫీజ్‌పేట్, గంగారం, చందానగర్, బీహెచ్‌ఈఎల్, గోపినగర్, నల్లగండ్ల తదితర ప్రాంతాలలో నెలకొల్పిన వినాయక విగ్రహాల 13వ రోజు నిమజ్జనం చేశారు. 6875 గణనాథుల విగ్రహాలు చందానగర్ సర్కిల్ పరిధిలో నిమజ్జనం చేశారని ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు.





గంగారం చెరువులో విగ్రహాల నిమజ్జనం

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా..



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: మియాపూర్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఏఎస్ రాజు నగర్, మహోదయ ఎన్‌క్లేవ్ కాలనీలలో వరద నీటి కాలువ చేపట్టబోయే పరిసర ప్రాంతాలను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముంపునకు గురైన కాలనీలను దృష్టిలో పెట్టుకుని వరదనీరు సాఫీగా వెళ్లేలా కాలువ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో రవీంద్రకుమార్, చుక్కరావు, సతీష్, సూర్యనారాయణ రాజు, శశిధర్, భూపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో సినీనటి అనుపమ సందడి



భీమా జువెలరీ స్టోర్ ప్రారంభోత్సవంలో సినీనటి అనుపమ పరమేశ్వరన్, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, భీమా జువెల్స్ చైర్మన్ బిందుమాధవ్, ఎండీ తదితరులు

హఫీజ్‌పేట్ : చందానగర్‌లో సినీనటి కార్తికేయటూ, టిల్లు స్క్వేర్ ఫేమ్ అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. ఆదివారం చందానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భీమా జ్యువెలర్స్ స్టోర్‌ను సినీనటి అనుపమ పరమేశ్వరన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, భీమా జువెల్స్ చైర్మన్ బిందుమాధవ్, ఎండీ అభిషేక్ బిందుమాధవ్, డైరెక్టర్ సరోజని బిందుమాధవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమా స్టోర్‌లో డైలీవేర్, సింపుల్ డిజైన్లు, బ్రైడల్ జువెల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. టిల్లు స్క్వేర్ మూవీ రిలీజ్‌కు ఉందని, తదుపరి చిత్రం రవితేజతో చేస్తున్నానని నటి అనుపమ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ అవసరం





గోపన్‌పల్లిలోని జవహర్ నవదోయ విద్యాలయలో..

రాయదుర్గం: భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సూచనల మేరకు గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రాంగణంలో స్వచ్ఛత హీ సేవా అభియాన్–2023 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఉపసంచాలకులు తలపల గోపాలకృష్ణ, సహాయ కమిషనర్లు కెవి సుబ్బారెడ్డి, అభిజిత్ రంజిత బెహ్రా, జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, జేఎన్‌వి ప్రిన్సిపల్ విజయభాస్కర్‌తో కలిసి ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు క్యాంపస్‌లో శ్రమదానం చేశారు. విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులు క్యాంపస్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ, రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌వీ విద్యార్థులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎస్‌ఎస్‌ఎస్ విభాగాల వాలంటీర్లు, అధ్యాపక, నాన్‌టీచింగ్ స్టాఫ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల ర్యాలీ..

గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

హఫీజ్‌పేట్‌లో..

హఫీజ్‌పేట్ : ప్రధానీ నరేంద్రమోడీ పిలుపు మేరకు హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట పరిసర ప్రాంతాలలో బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్–ఆరోగ్య భారత్ కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బోయిని మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, జగన్ గౌడ్, మొహమ్మద్ సలీం, పవన్ కుమార్, దేవేందర్ ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవిహార్ ఫేజ్–2లో..

శేరిలింగంపల్లి: లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీలో స్వచ్ఛహీసేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్‌దూబే మాట్లాడుతూ ప్రతి నెల ఒకసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు నర్సింహ్మారావు, కార్యదర్శులు సీతారామరాజు, మాధవికుమార్, సభ్యులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రావు, రామమూర్తి, కాలనీవాసులు,జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కేశవనగర్‌లో..

రాయదుర్గం: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే మా లక్ష్యమని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపుపై గచ్చిబౌలి డివిజన్ కేశవనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హెచ్‌సీయూలో..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఏక్ తారీఖ్ ఏక్ ఘంట పేరిట ఆదివారం స్వచ్ఛత కార్యక్రమంను చేపట్టారు. వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462